

# గోపాలం గర్ల్‌ఫ్రెండ్

అందె గోపాలకృష్ణమూర్తి

"హాయ్ ఉషా!" అంటూ హాస్టల్ టర్నింగ్‌లో కనబడిన ఉషకు స్వాగతం పల్కింది పదిహేను నిమిషాలనుండీ బస్‌రాక విసిగెత్తిపోయిన సుందరి.

"హాయ్!" అంటూ, అసలే చిన్నగా ఉన్న మూతిని ఇంకా చిన్ని సున్నాలా చుట్టి, 'టక్కూ టక్కూ' మని ఎత్తుమడాల జోళ్ళను చప్పుడు చేస్తూ, నేస్తం దగ్గరకొచ్చి జేరింది 'మినియేచర్ వైజయంతిమాల' లాంటి అమ్మాయి.

"ఏహోయ్, మీకూ ఫస్టవర్ క్లాసు లేదా?" అన్నది సుందరి.

"నో" ముక్తసరిగా అని, అప్పటివరకూ తన వైపు గ్రుచ్చినట్టు చూస్తున్న అబ్బాయివైపు పరీక్షగా చూసింది.

సదరు అబ్బాయి వెంటనే సర్దుకొని, చూపుని పైకి మరల్చి, ప్రక్కనే గోడమీదున్న 'దునియా' సినిమా పోస్టరు తాలూకు దేవానందు బొమ్మమీద దృష్టి నిల్పి, ఆనక బస్సొచ్చే వైపుకి ముఖం త్రిప్పి, ఏఁవీ ఎరగనట్టు నిలబడి పోయాడు.

"ఆఁహా!" మనసులోనే ఏదో నిర్ణయానికొచ్చిన ఉష ఓసారి గొంతు సవరించుకొని, "చూడు సుందరీ!" అన్నది.

"ఎవర్ని?" వెంటనే అడిగింది సుందరి.

"బోడిజోకూ నువ్వూను! చెప్పేది విను!" అన్నది ఉష.

"వింటా చెప్పు" అన్నది సుందరి.

"ఇప్పుడూ—" ప్రారంభించింది ఉష.

"ఎప్పుడు?" అమాయకంగా మొహం పెట్టి ప్రశ్నించింది సుందరి.

"ఇదిగో, విసిగెయ్యక చెప్పేది విను, ఇప్పుడు సాధారణంగా అద్దాలు, అవే - 'కళ్ళద్దాలు' రెండు రకాలు: ఒకటి చలవద్దాలూ, రెండు జబ్బుఅద్దాలు"

"అదేమిటోయ్ ఉషా, ఉన్నట్టుండి కళ్ళద్దాల క్లాసుతీసుకుంటున్నావ్, ఏవిటి సంగతి?" అంటూ చుట్టూ కలయజూసింది సుందరి.

కలయజూస్తున్న సుందరి కళ్ళు యిందాకటి అబ్బాయిమీద పడేసరికి సుందరి పెదిమలు యించగ్గా నవ్వినయ్. బిక్కమొహం పెట్టుకొన్న అబ్బాయి మాత్రం అనుకోకుండా తన నల్ల బద్దీల స్క్వేర్ ఫ్రేమ్‌లో ఇమిడిన కళ్ళద్దాలను ఓ సారి సర్దుకొని చెవులను ఉషా, సుందరిలవైపు వదిలేశాడు.

"ఏం?" అంటూ మళ్ళీ ప్రారంభించింది ఉష. "మళ్ళీ చలవద్దాలు జబ్బు అద్దాలు రెండురకాలు, ఒకటి నల్లద్దాలు రెండు. పాదరసం అద్దాలూను!"

"మరి జబ్బుఅద్దాలో?" ఉత్సాహంగా ప్రశ్నించింది, ఉషారుగా చెప్తున్న ఉషను సుందరి.

"జబ్బు అద్దాలు పలు విధములు. షార్ట్‌సైటూ, లాంగ్ సైటూ, చత్వారం వగైరాలు. కాని చాలా మంది చదువుకునేవాళ్ళకి ఎక్కువగా షార్ట్‌సైటు వస్తుందన్నమాట!"

"షార్ట్‌సైట్ అద్దాలలో మరింక రకాలు లేవా?" వెక్కిరిస్తున్న ధోరణిలో ప్రశ్నించింది సుందరి, ప్రక్కనే ఉన్న అబ్బాయిని చూస్తూ.

"ఎందుకులేవూ? బ్రహ్మాండంగా ఉన్నాయ్. వాటిలో భూతద్దాలనీ, సోడాబుడ్డి అద్దాలనీ ఊఁ- ఇంకా, గోళీకాయ అద్దాలనీ రకరకాలున్నాయ్."

ఉష మాటలు వింటూనే పకపకా నవ్వేసి, నవ్వునంతటినీ చేతిలో ఉన్న పువ్వుల రుమాల్లో దాచేసింది సుందరి.

"ఇప్పుడు మనం సడన్‌గా సినిమావేసుకోవాలనుకో, చుట్టుపక్కల ఎవరికైనా భూతద్దాల కళ్ళజోడుంటే అడిగి తీసుకొని, సినిమా వేసుకొని తిరిగి యిచ్చేయొచ్చు నన్నమాట!"-ఉషా సుందరీ ఇద్దరూ 'డ్యూయెట్'నవ్వులు నవ్వేరు.

నల్లబద్దీల కళ్ళద్దాల అబ్బాయి గుటకలు మ్రింగేడు.

"భూతద్దాల వల్లగల ప్రయోజనము మరియొకటి పేర్కొనుము" నవ్వు మధ్యలో డైలాగు వేసింది సుందరి.

"ఆఁ - ఏవిటి చెప్మా!... రైట్. చూడూ, ఎవరైనా సిగరెట్ ముట్టించుకోవాలనుకో, సమయానికి అగ్గిపెట్టె ఉండదనుకో, అప్పుడు, ఈ భూతద్దాల్ని ఎండకి అడ్డుగాపెట్టి, సిగరెట్టు, చుట్టా, బీడీ వగైరాలు అంటించుకోవచ్చు!"

ఉష మాటలు వింటూ విపరీతంగా నవ్వేస్తూ, చేతిలో పుస్తకాల్ని వదిలేసింది సుందరి.

"ఏవిటోయ్ మరీనూ!" అంటూ సుందరి పుస్తకాల్ని తీసే ప్రయత్నంలో క్రిందికు వంగిన ఉషకు కళ్ళద్దాలబ్బాయి నిల్చొన్నచోట 'రప్‌రప్' మంటూ రాలిపడ్తున్న కన్నీటిబొట్లు ఎన్నో కన్పించినయ్. ఒక్క క్షణం హృదయం ద్రవించినట్లైంది. పుస్తకాల్ని వత్తుపెట్టి, సుందరికి అందిస్తూ 'కళ్ళద్దాలబ్బాయి' వైపు ఓసారి చూసింది ఉష.

'మీకు భగవంతుడు ఎంతో అందమైన కళ్ళనిచ్చాడు, కాదనను. వాటికి కాటుకా అదీ తీర్చిదిద్ది ఇంకాఅందంగా మీరు తయారుచేసుకొంటారు. కాని నేనో? ఫిజిక్సు చదువుకొంటున్న మూలంగా రోజూ టెలిస్కోపులూ, మైక్రోస్కోపుల్తో నానా యాతన పడుతూ ఇలా కళ్ళజబ్బు కొనితెచ్చుకున్నాను. మీరూ ఫిజిక్స్ చదివితే సరి, నాకంటె

మందమైన అద్దాలు - త్రీపాయింట్ ఫైవ్ - రాయల్ ఎన్‌ఫీల్డ్ - బుల్లెట్‌ప్రూఫ్' అద్దాలొ నస్ - అం'-

- అనేద్దామని డైలాగు మనసులో ప్రిపేరయ్యే లోపున నీలంరంగు నెంబర్ టెన్ బస్సు రావడం, ఉషా, సుందరీ ఛెంగ్‌న లోపలికి దూరడం. "ఖాళీ లేదు పోనీయ్, రైట్ రైట్. ఎక్కడా ఆపక!" అంటున్న క్లీనర్ మాట ప్రకారం బస్సు ముందుకు దూసుకుపోవడం కళ్ళద్దాలబ్బాయి కన్నీటితో మిగిలి పోవడం క్షణంలో జరిగిపోయినయ్.

'ఈ అద్దాల్ని ఏమైనా సరే, ఎంత ఖర్చయినా సరే వదిలించేసుకోవాలి!' గట్టిగా అనుకొన్నాడు కళ్ళద్దాలబ్బాయి గుటకలు మింగేస్తూ.

* * *

"ఏమిటోయ్ ఉషా, పాపం మా కళ్ళద్దాల గోపాలాన్ని అలా టాపు లేపేసి ఏడిపించేసేవ్? అతని కన్నీళ్ళు చూసేసరికి నాకు గుండె తరుక్కు పోయిందనుకో?" అన్నది సుందరి, మధ్యాహ్నం కేంటీన్‌లో రసగుల్లా తింటూ.

"అఁ అఁ, ఆ గోపాలం నువ్వనుకొన్నంత అమాయకుడుకాడు. మొన్ననోసారి ఏమైయ్యిందో తెల్సా?"

"తెలీదు, చెప్పు!"

"మొన్ననూ..."

—హాస్పిటల్ బస్‌స్టాప్‌లో ఒంటరిగా నిల్చు న్నది ఉష. అంతలోకే ఎటునుంచో హఠాత్తుగా ఇద్దరబ్బాయిలొచ్చి దగ్గరజేరేరు. అందులోఒకతనికి అద్దాలున్నయ్ రెండో అతనికి అద్దాల్లేవు. అద్దాల్లేని అబ్బాయి అద్దాలున్న అబ్బాయిని "గురూ గోపాలం!" అని పిల్చేడు.

'ఓహో, అద్దాలబ్బాయిపేరు గోపాలం, అతని ఇంటిపేరు 'గురూ'ను గామోసు' ననుకొని విప్పేసు కొని చిన్నగా నవ్వుకొన్నది ఉష.

అద్దాల్లేని అబ్బాయి మరి ఏం సైగజేసేడో ఏమో, గోపాలంఒక్కసారిగా 'పులి' అయిపోయేడు.

"చూడరా మూర్తీ 'పంకాల్లోకన్నిటికంటె ఏ 'పంకా' మంచిది?" అన్నాడు గోపాలం క్రీగంట (అద్దాల్లోంచి) ఉషవైపు చూస్తూ.

"ఉషా పంకాలనే వాడుడు!" సలహా ఇచ్చాడు మూర్తి.

"ఉషా పంకాలు ఎన్ని రకాలు?" అడిగాడు గోపాలం

"టేబుల్ ఫేన్లూ, సీలింగ్ ఫేన్లూ, తోపుడు ఫేన్లూ, ఉషా-ఆల్-పర్పస్-ఫేన్లూ అని పలు విధ ములు గలవు. మళ్ళీ వీటన్నిటిలోనూ గచ్చకాయ రంగు ఉషా ఫేన్లూ, ఆకుపచ్చ, గోధుమరంగు ఉషా ఫేన్లూ, కొన్ని గిర్రున తిరిగే ఉషాఫేన్లూ. అబ్బో-నానా రకాలు!" అంటూ పడిపడి నవ్వేడు గోపాలం.

ఉష తన 'చిన్నిమూతి'నిఇంకా'చిన్నిసున్నా'లా చుట్టి, గట్టిగా ఊపిరిపీల్చి, వదిలింది.

చూడరోయ్ మూర్తీ! ఇంకా విను! ఉషా ఫేనులే కాక, ఉషా కుట్టుమిషన్లెన్ని రకాలో తెల్సా?" అన్నాడు హుషారుగా గోపాలం

"తెలీదు" అన్నాడు మూర్తి.

"ఐతే విను! ఉషా కుట్టుమిషన్లు రెండురకాలు ఒకటి చేతి మిషన్లు, రెండు కాలి మిషన్లు—"

గోపాలం మాట వింటూనే ఘొల్లుమన్నవ్వేడు మూర్తి.

"ఆ కుట్టుమిషనేగాని ఉంటే మీ నోళ్ళు కుట్టిపారేద్దును" అందామనుకొన్న ఉషకి స్త్రీ సహజమైన సిగ్గుతో కోపం కలగడం మూలంగా, నోరు పెగలలేదు పెదిమలు కోపంతో కొరికేస్తూ బస్సొచ్చేవరకూ నిస్సహాయంగానిలబడిపోయింది.

అందుచేత ఎల్లప్పుడూ ఉషామార్కు పంకాలనూ, కుట్టుమిషన్లనే వాడుడు!" అంటూ గోపాలం, మూర్తీలుకూడా బస్సువెనక వెళ్ళాడేరు.

"...... ." అందుకన్న మాట పొద్దుట అలా కన్నీళ్ళు తెప్పించేను" అన్నది ఉష గర్వంగా.

"అహఁ! అదా ఫ్లేష్-బేక్ స్టోరీ! కుర్రాడు చూస్తే వొర్రి అమాయకుళ్ళా, అద్దాలూ అవీ వేసుకొని బుద్ధిమంతుళ్ళా నిల్చొంటె ఏవో అను కున్నాను. మంచిపనే చేసేవ్. కంగ్రాట్స్, ఏదీ ఇంకో స్వీట్‌కి ఆర్డరియ్!" అంటూ హుషారుగా సర్వర్‌ని పిల్చింది సుందరి.

* * *

"ఏవోయ్ ఉషా! అలా పడుకున్నావ్, నడు బీచ్‌కి పోదాం" అన్నది సుందరి.

"అబ్బబ్బ! ప్రాక్టికల్స్ చేసొచ్చేసరికి బోర్ కొట్టేసింది. దాంతో ఎండలో బస్‌కోసం నిల్చున్నా నేమో, విపరీతమైన తలనొప్పి వచ్చేసింది. తల బద్దలై పోతుందనుకో!" నీరసంగా అన్నది ఉష.

"అనాసిన్ మింగలేక పోయేవా?

"అదీ అయింది. లాభంలేక ఇలా తలపట్టుకు పడుకున్నాను. ఐ వాంట్ సమ్ రెస్ట్! నువ్వు మిగతావాళ్ళతో కల్సి వెళ్ళిపో!"

"రైటో" అంటూ నిష్క్రమించింది సుందరి.

విపరీతమైన తలనొప్పితో మెలికలు తిరిగిపోయి మూలుగు ప్రారంభించింది ఉష. రూమ్మేట్లూ, సైడు రూమ్మేట్లూ అందరూ వచ్చి సలహాలు ఉచితంగానే ఇచ్చి తలోరకం మాత్రా మింగించేసేరు. దాంతో ఇంకా ఉధృతమైపోయింది తలనొప్పి. మర్నాడు క్లాసులు మానేసి "అయ్యో నొప్పి, తల నొప్పి, కళ్ళుపోట్లు, నరాలులాగేస్తున్నాయ్" అంటూ గోలగోల చేసేసింది ఉష.

"నడవ్వోయ్, డాక్టరు దగ్గరకెళ్దాం" అంటూ దగ్గర్లోనే ఉన్న డిస్పెన్సరీకి నడిపించేరు స్నేహితురాండ్రు.

ఇది అనారోగ్యంవల్లకాదు తల్లీ. తెల్లవార్లూ చదవడంమూలాన కళ్ళు కాస్త దెబ్బతినడంవల్ల ఇలా తలనొప్పి వస్తూఉండవచ్చు. యు బెటర్ కన్సల్ట్ సమ్ ఐ-స్పెషలిస్ట్" అని సలహా ఇచ్చి ఫీజు పుచ్చుకున్నాడు డాక్టరుగారు.

కన్సల్ట్ చేసిన తర్వాత ఐ-స్పెషలిస్ట్ ఆ టెస్టూ ఈ టెస్టూ చేసి, కంట్లో ఆ మందూ ఈ మందూ వేసి ఆ అలను, ఏ బీ సీ డీ లనూ చదివించి," అమ్మా, నీపేరేమిటమ్మా" అన్నాడు

"ఉష" అన్నది ఉష.

"చాలా మంచిపేరు తల్లీ నీది. నీ పేరున్న వాళ్ళంతా ఎంత అదృష్టవంతులో తెల్సా! ఆ పేరుతో-పంకాలూ, కుట్టుమిషన్లూ తయారు చేసి, ఆ కంపెనీవాళ్లు ఎంతలేని లాభాలుపొందుతున్నారో నీకు తెలియని దేముందమ్మా."

"డాక్టరుగారూ!" అని అరిచిన ఉష కళ్ళ ముందు కళ్ళజోడు గోపాలం లీలగా మెదిలాడు.

"కంగారు పడకమ్మా, నువ్వు జీవితంలో ఎంతో అదృష్టవంతురాలి వవుతావ్. ఇదిగో చూడు, దీన్లో వ్రాసిన ప్రకారం కళ్ళజోడు కట్టించుకొని అలా పెట్టుకో. ఇలా తలనొప్పి మాయమై పోతుంది!"

"కళ్ళజోడా, నేను చచ్చినా పెట్టుకోను!" అరిచింది ఉష.

"అయితే బాధ ననుభవించాల్సిందే. ఆనక నీ యిష్టం తల్లీ! అంటూ లేచిపోయాడు ఐ-స్పెషలిస్టు.

"భగవాన్, ఇప్పుడెలా?" తల చేత్తో పట్టు క్కూర్చుండిపోయింది ఉష.

* * *

మొదటిసారిగా కళ్ళజోడు పెట్టుకొని, ఏదో అవమానంతో బాధపడుతున్నట్లుగా ఫీలవుతూ బస్‌స్టాపు కొచ్చింది ఉష.

ఎదురుగా - గోపాలం! తలదించేసుకోబోయిన ఉష ఎందుకో, ఒక్కసారిగా అతని ముఖంవైపు చూసింది. చూసి విపరీతంగా ఆశ్చర్యపోయింది!

"అరె, గోపాలాన్కి కళ్ళజోడు లేదే? ఏమైంది! తీసేస్తే ఎలా కన్పడుతుంది? అదీగాక, తనవైపు దూరంనుంచే నవ్వుతూ చూసేడే! అంత లావుపాటి అద్దాలు లేందే ఎలా చూడగల్గుతున్నాడు? అవును ఎలా చూడగల్గుతున్నాడు? అదేదో తనకీ చెప్తే ఈ కళ్ళజోడు బాధ ఉండదే! ఎలా అడగడం? ఔను, తప్పేముంది? అడిగేస్తా! పోయిందేముంది, అవమానిస్తే అవమానిస్తాడు!" సతమతమైపో సాగింది ఉష. ఇంతలో,-

"చూసేరా, అనాడు నా అద్దాలమీద జోకు లేసేరు, దేవుడు మీకు అద్దాలు ఏర్పాటు చేసేడు. ఇపుడు నాకు అద్దాలు అవసరం లేదుగా! హాయిగా చూడగలిగే ఏర్పాటు చేసుకున్నా, ఓచ్!" అన్నాడు గోపాలం, దగ్గిరగావచ్చి.

"నన్ను క్షమించండి గోపాల్- దేవుడు నాకు తగిన ప్రాయశ్చిత్తం చేసేడు. ఇంకెప్పుడూ ఎవర్నీ ఏమీ అనను. మీరు అద్దాలు లేకుండా ఉండడాన్కి ఏంచేసేరో చెప్పరా!" గోముగా అడిగింది ఉష.

సీరెపోయేడు గోపాలం. అయినా తమాయించు కొని. "నేనెందుకు చెప్పాలి? అసలు మీరెవరో నేనెవరో, చెప్పనుగాక చెప్పను"

"అంతేనా? చెప్పరా? ప్లీ...జ్, మీరు నా ఫ్రెండ్ కారా? మీ గర్ల్‌ఫ్రెండ్గా అడిగితే చెప్పరా"

"నిజమే! 'మీరు నా ఫ్రెండ్' ప్రామిస్? నోరావిలేని చేయి జూపేడు గోపాలం ముడేసుకు పోతూ.

"ప్రామిస్!" అంటూ గోపాలం చేతిలో చేయి వేయబోయి, అది పబ్లిక్‌రోడ్ అని గుర్తు

## నేస్తాలు



ఫొటో : చంద్రప్రసాద్

కొచ్చి, చప్పున చేయి వెనక్కులాగేసుకున్నది ఉష.

"ఐతే చెప్పేస్తున్నా ... చెప్పే... స్తున్నా" అన్నాడు గోపాలం ముగ్గుడైపోతూ, కుడిచేతి బొటనవేలిని అదేపనిగా నములేస్తూను.

"ఊఁ, చెప్పండి! -" ముద్దుగా ఉష!

"చెబితే ఏమిస్తారు? - గోముగా గోపాలం!

"ఏం కావాలంటే అదీ." - ఉషహామీ.

"మరి... సినిమాకి... తీసికెళ్ళాలి..." — గోపాలం కోరిక.

"ఒక్క సినిమా యేమిటి, ప్రతి సినిమాలకి తీసికెడతా. చెప్పండి, వేగిరం". ! సస్పెన్స్ భరించ లేని ఉష.

"ప్రతి సినిమాలే! థేంక్యూ! ఏవేవిటి? హిందీవా ఇంగ్లీషువా? నాకు తెలుగుసినిమా వొద్దు. హిందీసినిమాల్లో దేవానంద్ ఉండేవే కావాలి. ఇంగ్లీషువి యేవైనా ఫర్వాలేదు, లీలామహల్లో యివేళ్ళ" నాకూ లేకుండా గడగడలాడేడు గోపాలం.

"అబ్బబ్బబ్బబ్బా బోరు!" కోప్పడింది ఉష. "ఇంతకీ అసలుసంగతి చెప్తారా? నే వెళ్ళిపోనా?" అని బెదిరించింది.

"వెళ్ళొద్దు చెప్తా" నన్నాడు గోపాలం.

"అయితేచెప్పేయండి" అంటూ దగ్గరకొచ్చింది ఉష.

మీరు నన్ను అప్పుడు ఏడిపించేసుగా, అప్పట్నించీ ఆ పుస్తకాలూ, ఈ పుస్తకాలూచూసి, కళ్ళజోడులేకుండా ఉండే మార్గం గురించి ఎంక్వయిరీ చేసా. కొత్తగా 'కాంటాక్ట్ లెన్సెస్' అని వచ్చినయ్‌లెండి. మన 'సైరాభాను' వాళ్ళూ అవే వాడుతున్నారు. వాటిని కంటిలోనే పైన అమరుస్తారు. అసలు కళ్ళజోడు అవసరంలేదు. ఈ సోడాబుడ్ల అద్దాల్తో కరెక్ట్ అవ్వని 'సైట్' కూడా ఈ 'కాంటాక్ట్ లెన్సెస్'తో కరెక్ట్ చేయొచ్చు. తెల్సా? ఇంకా తెలియాలంటే 'ఫిజిక్స్' చదువుకోవాలి. అర్థమైంది కదూ? అయితే నా సినిమా చెప్పుడూ మరి చెప్పండి!" అడిగాడు గోపాలం.

"తలనొప్పి క్కూడా ఆ కాంటాక్ట్ లెన్సెస్ ఉంటవా?" అన్నది ఉష ఆలోచిస్తూ.

"నా 'ప్రతి' సినిమాలూ చూపించేస్తే ఆ విషయం చెప్తా- లేకపోతే చెప్పను!" మొండిగా అన్నాడు గోపాలం,

"ప్లీ...జ్" అన్నది ఉష.

"ప్లీజ్ అనగానే 'ఐసై'పోయి చెప్పేస్తాననుకొన్నారా? యుప్లీజ్ మీట్ మీ ఎట్ 'లీలామహల్' బై సిక్స్-టెన్ యీవ్నింగ్, ఓకే" అంటూ చకచకా వెళ్ళిపోయిన గోపాలం వైపు చూస్తూ నిల్చుండి పోయింది ఉష.

* * *

ఆ రోజు సాయంత్రం లీలామహల్ బాల్కనీలో ఒకటీ, రెండూ సీట్లలో కూర్చున్న ఉషా, గోపాలంలు ఒకే, 'కోకా-కోలా' బాటిల్లో రెండు 'స్ట్రా'లు వేయించుకొని, చెరొకవైపునుంచీ త్రాగుతున్నప్పుడు గోపాలం అన్నాడుకదా:- "చూడమ్మా గర్ల్‌ఫ్రెండూ, భూతద్దాల్లాంటి కళ్ళద్దాలతో సినిమాలు తియ్యొచ్చని మీరు జోకేరే, వాటితో సినిమాలు తీయడం ఎంతవరకూ నిజమో తెలీదు గాని, వాటి మూలంగా సినిమాలకు తీసికెళ్ళడం మాత్రం నిజంగా 'నిజెం!' అవునా,"

"ఉష్‌ష్" అన్నది ఉష.

'ఉష్' అయిపోయాడు గోపాలం!! ★